క్లుప్తంగా

పల్లెల్లో వైద్య శిబిరాలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై గణేష్

చర్ల: పేదల కోసం పట్టణాలకు చెందిన ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనయని దుమ్ముగూడెం ఎస్సై గణేష్ పేర్కొన్నారు. దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలో భద్రాచలానికి చెందిన శ్రీ సురక్షా మల్టీ స్పెషాలటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్పటల్ వైద్యులు డాక్టర్ అక్కినేని లోకేష్, డాక్టర్ సూరపనేని శ్రీకాంత్రి శిబిరానికి వచ్చిన 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ కొప్పుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

వలస ఆదివాసీలకు అండగా ఉంటాం



రగ్గుల పంపిణీ కార్యక్రమంలో టీం సంభవ ఫౌండేషన్ ప్రతినిధులు

బూర్గంపాడు: వలస ఆదివాసీలకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తూ.. అండగా ఉంటామని హైదరాబాద్‌కు చెందిన టీం సంభవ ఫౌండేషన్ ప్రతినిధి పురుషోత్తం అన్నారు. మండల పరిధిలోని దేవయ్యగుంపు, రేగులగండి వలస ఆదివాసీ గ్రామాలలోని 110 కుటుంబాలకు ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు.అదేవిధంగా పిల్లలకు వార్మ్ బ్యాగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల అటవీగ్రామాలలోని వలస ఆదివాసీలు చలి నుంచి రక్షణ కల్పించేందుకు రగ్గులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సత్యప్రసాద్, సద్గుర్‌నాథ్, రూప్లానాయక్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులను నిరసిస్తూ పాదయాత్ర

చర్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆదివారం చర్లలో అయ్యప్ప దీక్షాపరులు పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని దండుపేటలో గల అప్పయ్య ఆలయం నుంచి పర్ణశాలలోని రామాలయం వరకు ఈ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు బంగ్లాదేశ్ దాడులను అరికట్టాలని, దాడులకు పాల్పడుతున్న వారిని శిక్షించాలని కోరుతూ పాదయాత్ర పొడవునా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షపరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తులు విరాళం అందజేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఎలమర్తి శ్రీరామకృష్ణ రూ.1.20 లక్ష చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.

పంచాయతీ కారోబార్ హఠాన్మరణం

కరకగూడెం: గత 20 సంవత్సరాలుగా కరకగూడెం మేజర్ గ్రామ పంచాయతీ కారోబార్‌గా సేవలందిస్తున్న చిరుమళ్ల గ్రామానికి చెందిన ఇల్లేందుల పిచ్చయ్య(55) హఠాన్మరణం చెందాడు. అయన గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.ఈ క్రమంలో ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురైన ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. దీంతో ములుగు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మూడు సంవత్సరాల క్రితం ఆయన కుమార్తె చనిపోవడం ఇప్పుడు పిచ్చయ్య అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అనారోగ్యంతో వ్యాపారి..

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంకు చెందిన ప్రముఖ వ్యాపారి కటుకూరి సుబ్బారావు ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున సుబ్బారావుకు భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్న సందర్భంలో మృతి చెందారు. సుబ్బారావు మృతి పట్ల పలువురు వ్యాపారులు, పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇది మందుబాబుల పనేనా!?

- మూలమలుపులో స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు
- తరచూ పడదోస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు
- మద్యం మత్తులో కొందరి నిర్వాకంగా అనుమానం



రాళ్లగూడెం మలుపులో స్పీడ్ స్టాపర్లను పడదోసిన దృశ్యం

చర్ల: మండలంలోని రాళ్లగూడెం శివారులో ఉన్న మూలమలుపు వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను అరికట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఏర్పాటు చేసిన స్పీడు స్టాపర్లను (ఇసుకను నింపి ఏర్పాటు చేసిన డ్రమ్ములు) మందు బాబులు పడదోస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం-వెంకటాపురం మార్గంలోని చర్ల మండలం రాళ్లగూడెం-ముసలిమడుగు గ్రామాల మధ్యలో రహదారి మూలమలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. గతంలో చాలా సందర్భాల్లో ఇక్కడ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొని పలువురి ప్రాణాలు పోయాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు, బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న సందర్భాల్లో పలువురు తీవ్రంగా గాయపడగా, పలువురు మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలో మూలమలుపులో వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను అదుపు చేయాలన్న లక్ష్యంతో ఇటు రాళ్లగూడెం శివారు అటు ముసలిమడుగు శివార్లలో ప్రధాన రహదార్లపై ఇసుకతో నిపించిన డ్రమ్ములను దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేశా. వాటికి వైట్ పేయింట్ వేసి రేడియం ఎరుపు రంగులో ఉన్న స్టిక్కర్లను అంటించారు. ఈ క్రమంలో గత ఆరు నెలల కాలంలో ఈ ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు.

అయితే ఈ ప్రాంతానికి సమీపంలో రాత్రి పూట కొందరు మద్యం సేవిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే గ్రామపంచాయతీ వారు ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై కూర్చొని అర్ధరాత్రి వరకు చిత్తుగా మద్యం సేవించడం, తాగిన మైకంలో రోడ్డుపై ఉన్న డమ్ములను పడదోయడం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మందు బాబులు రోడ్డుకు ఒకవైపున ఉన్న డ్రమ్ములను పడవేశారు. అదే సమయంలో భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు కింద పడి ఉన్న డ్రమ్మును గుర్తించలేకపోయాడు. దీంతో నేరుగా వచ్చి దానికి ఢీకొట్టి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటు తరువాత మళ్లీ ప్రమాదాలు చోటు చేసుకోగూడదన్న ఉద్దేశ్యంతో రాళ్లగూడెంకు చెందిన కొందరు యువకులు కిందపడవేసి ఉన్న డ్రమ్ములను పైకి లేపి మళ్లీ వాటిలో ఇసుకను నింపారు. అయితే తాజాగా రెండు రోజుల క్రితం మళ్లీ మందుబాబులు పడవేశారు. దీంతో మళ్లీ ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అధికారులు వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతంలో మద్యం సేవిస్తూ ప్రమాదాలు చోటు చేసుకునేందుకు కారకులు అవుతున్న మందు బాబుల ఆగడాలను అరికట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మూల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పర్మినెంట్‌గా ఉండేలా స్పీడు స్టాపర్లను ఏర్పాటు చేయాలి.

– కూరపాటి వీర్రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆకతాయిలను గుర్తించాలి



ప్రమాదాలను నివారించేందుకు రాళ్లగూడెం మలుపులో ఏర్పాటు చేసిన స్పీడు స్టాపర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారకులవుతున్న వారిని గుర్తించాలి. వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రమాదభరితంగా ఉన్న మరికొన్ని ప్రాంతాల్లోనూ స్టాపర్లు ఏర్పాటు చేయాలి.

– కొండా కౌశిక్, చర్ల

స్థానిక సమరానికి సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

మణుగూరుటౌన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ ఇల్లా కార్యవర్గ సభ్యులు, మండల పట్టణ కార్యదర్శులు, సహాయ కార్యదర్శుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తామని, అవసరమైతే ఒంటరిగా పోటీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాడవాడలా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి సీపీఐ పోరాట చరిత్ర, త్యాగాలను ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వ చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యానికి చేరువలో ఉన్నామని, మిగిలిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య మాట్లాడారు. సమావేశంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, సరెడ్డిపుల్లారెడ్డి, సలీం, సారయ్య, మున్నా లక్ష్మీకుమారి, కమటం వెంకటేశ్వరరావు, ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్, మండలాల పట్టణాల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివాలయంలో చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపరెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం చండీయాగం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ హోమంలో సత్తుపల్లి, కల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

అశ్వారావుపేటరూరల్: పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక అమ్మసేవా సదనంలోగల అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు శీమకుర్తి వెంకటేశ్వరరావు, కొనిజర్ల ఉమామహేశ్వరరావు, కోరుకొండ రామ్మోహన్‌రావు, బోగవల్లి రాంబాబు, జల్లిపల్లి గుప్తా, శీమకుర్తి సుబ్బారావు, సత్యవరపు బాలయ్య, ఎస్ఎల్ నరసింహారావు, కంచర్ల జగదీష్, బొమ్మ రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మండల పరిధిలోని తిర్లాపురం గ్రామపంచాయతీలో మాజీ సర్పంచ్ తాటి పూర్ణచందర్‌రావు, తల్లి తాటి ముత్తమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్‌లు ఆదివారం వారి గృహానికి వెళ్లి ముత్తమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పట్టణ కోకన్వీనర్ నూకారపు రమేష్, నాయకులు అక్కి నర్సింహారావు, ముద్దంగుల కృష్ణ, ఉప్పుతల రామారావు, లేళ్ల కృష్ణ, ధారావత్ రమా, బానోత్ రమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన క్రీడాకారులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆదివారం అభినందించారు. పట్టణంలో జరిగిన సుమన్ షుటకాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ టెస్ట్ పోటీల్లో చిరహాసిని, పునీత్ కుమార్‌లు విజేతలుగా నిలవగా వారికి ఎమ్మెల్యే వెంకట్రావ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ శ్రీనివాస్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.


చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు

మణుగూరురూరల్: ఏజెన్సీ చట్టాల పరిరక్షణ కోసం ఆదివాసీలంతా ఉద్యమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్(ఏఎస్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు పిలుపునిచ్చారు. మండలంలోని వాసవినగర్‌లో గల గిరిజనభవన్‌లో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు మండలాల్లో 1/70, పెసా, ఆర్ఓఎఫ్ఆర్ చట్టాల దుర్వినియోగం అవుతున్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన గిరిజనేతరులు అమాయక గిరిజన సొసైటీ నుంచి రైజింగ్ కాంట్రాక్ట్ పేరుతో ఇసుక ర్యాంపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారన్నారు. ఆదివాసీలందరికీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ అండగా ఉంటుందన్నారు. ఆదివాసీ చట్టాలు, సంక్షేమం కోసం నిర్వహించే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు,ఆదిశంకర్, ఏటీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీమల సత్యంలు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈసాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర, ప్రధాన కార్యదర్శి నూప సీతయ్య, నాయకులు వాగబోయిన శ్రీను, సోలం రమణ, రవి, హరిశంకర్, రమేష్, ప్రవీణ్, కోటి, రాంబాబు, స్వరూప, సౌందర్య, లక్ష్మి, విజయ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నాడు వరద.. నేడు కళకళ!



జూలైలో కట్టమైసమ్మ ఆలయం వద్ద వరదనీటిలో మునిగిన వరి పొలాలు

అశ్వారావుపేటరూరల్: ఈ ఏడాది జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షాలతో పెదవాగు ఉగ్రరూపం దాల్చి, పంట పొలాల్లోని ముంచెత్తిన సంఘటన గుర్తుందా!?. ఆనాడు భాగాంగా అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని శ్రీ కట్టమైసమ్మ ఆలయం, ప్రధాన రహదారి మినహా చుట్టు పక్కల ఉన్న వందలాది పంట పొలాలు వరదనీటిలో మునిగిపోయాయి. ప్రస్తుతం సరిగ్గా అదే ప్రదేశంలో నేడు ధాన్యం పంట చేతికంది కళకళలాడుతోంది. ఈ వరద గాయానికి, పంట సిరులకు అక్కడే ఉన్న శ్రీ కట్టమైసమ్మ తల్లే ప్రత్యేక్ష సాక్షి.



ప్రస్తుతం పంట పొలాలతో కళకళలాడుతున్న అదే ప్రాంతం..

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లకు ఆదివారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేశారు. మండలంలోని చినబండిరేవుతో పాటు పలు గ్రామాల్లో సుమారు రూ.86 లక్షల అంచనా వ్యవయంతో 18 చోట్ల సీసీ రోడ్లను నిర్మించనుండగా.. వాటికి భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు నాణ్యతగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సీఐ బి.అశోక్, మండల కాంగ్రెస్ నాయకులు లంకా అబ్బులు, శివాజీ, సాంబశివరావు, పిలకా వెంకటరెడ్డి, కోడి చంటి, బీమరాజు, పాయం వెంకటేష్, నరేంద్ర, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నాచారం, తొట్టిపంపు, జమేదారు బంజర గ్రామాల్లో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. జమేదారుబంజర గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర నాయక పోడు సంఘం అధ్యక్షుడు పసల బుచ్చయ్య, గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, నాయకపోడు సామాజిక వర్గానికి, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తులో నాయక పోడు సామాజిక వర్గానికి తగు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సోమవారం ఉచిత కంటి పరీక్షలు

మణుగూరురూరల్: కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో హైదరాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో కల్పిస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, ఆళ్లపల్లి మండలాల్లో ఎవరైనా కంటి చూపు సమస్యలతో బాధపడుతున్నట్లయితే.. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రతీ సోమవారం వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు, అవసరమైన వారికి పుష్పగిరి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. నాలుగు విడతలకు మాత్రమే బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతీ బస్సులో 41మందికి అవకాశం ఉందన్నారు. ఈ నెలతో కంటి వైద్య శిబిరాలు ముగుస్తాయని, ఇప్పటివరకు 450 ఉచిత కంటి ఆపరేషన్లు జరిగాయని తెలిపారు. కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకునేవారు నేటి సోమవారం అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇళ్లు కేటాయించాలని ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం ఇళ్లు కోల్పోయిన బాధితులు ఆదివారం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం తరువాత తమకు ఇళ్లు ఇస్తామని చెప్పిన అధికారులు.. ఇప్పుడు తమను పట్టించుకోకుండా వేరే వారికి ఇళ్లను కేటాయించి తమకు తీవ్ర అన్యాయం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం తమను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి తమని ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు బంటు రామకృష్ణ, తోట కళావతి, ఇమాంబి, షేక్ ఆలీమా, సావిత్రి, లక్ష్మి, సావిత్రి, వెంకటలక్ష్మి, చిలకమ్మా, వీరమ్మ, గంగమ్మ, నాగమణి, రమణ, రాణి, అలవాల రాజా పెరియార్, మేకల లత తదితరులు పాల్గొన్నారు.

ఓసీ ఆపరేటర్ల ఆర్థిక సాయం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఓసీ-2 ఏ రిలే ఆపరేటర్లు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన తోటి ఉద్యోగి రుద్రాక్షల కృష్ణ కుటుంబానికి ఆదివారం రూ.73వేలు అందజేశారు. పీవీకాలనీలోని వారి నివాసంలో షిఫ్ట్ ఇన్‌చార్జ్ ఎం.నర్సింహారావు చేతులమీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ తోటి ఉద్యోగులు ఆ కుంటుంబానికి అండగా నిలబడడాన్ని అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, కార్మికులు భార్గవ్, వెంకటరమణ, సుదీప్, రాజ్‌కుమార్, సయ్యద్ నయమత్ హుస్సేన్, మల్లికార్జునరావు, భాగం రవి కుమార్, గిరీశ్ రెడ్డి, శ్రీధర్, చెన్నుపాటి హనుమాన్ బాబు, కొత్త సత్యనారాయణ, యాకూబ్ పాషా, అన్నం రాజేందర్ తదితరులు ఉన్నారు.

వంతెన పనులకు మోక్షమెప్పుడు?



ఇసుకవాగుపై అర్ధంతరంగా నిలిచిన నిర్మాణ పనులు..

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులకు మోక్షం కలగడం లేదు. గత ఏడాది మే 29న ఇసుకవాగుపై రూ.7 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెనకు గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. కొంత కాలం వంతెన పనులు నత్తనడకన సాగాయి.

అనంతరం పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ఏడాదిన్నర గడిచినా వంతెన పనుల్లో పురోగతి లేదు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఆగిపోయినట్టు సమాచారం. కాగా, వంతెన పనుల కారణంగా గిరిజనుల రాకపోకలకు అప్రోచ్ రహదారి నిర్మించారు. అప్రోచ్ రహదారి తూతూమంత్రంగా నిర్మించడంతో ఒక్క వర్షం పడినా అప్రోచ్ రహదారి కొట్టుకుపోయి రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నారు. అప్రోచ్ రహదారి నిర్మించడం, కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. దీనిమూలంగా గిరిజనులకు ప్రయాణ దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతుల గూడెం గ్రామ పంచాయతీల్లోని 20 గ్రామాల గిరిజనులు రాకపోకలు నిలిచి బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు అందక మూడు నెలల పాటు ఇబ్బందులు పడతారు. ఇంత జరుగుతున్నా అప్రోచ్ రహదారి పకడ్బందీగా నిర్మించింది లేదు. ఎన్నో ఏళ్లుగా ఇసుక వాగు వల్ల ఇబ్బందులు పడుతున్న పడుతున్న గిరిజనులకు ఈ రకంగానూ తిప్పలు తప్పడం లేదు. వంతెన పనులు పునఃప్రారంభించి వేగవంతం చేయాలని, వర్షాకాలం లోపు రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఆ మేరకు ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.